రోజూ 39 మంది అదృశ్యం

- దేశంలో ఏటా వేల మంది మహిళల మిస్సింగ్
- ఏండ్లు గడుస్తున్నా.. అంతుబట్టని కారణాలు
- ఐదేండ్లలో కనిపించనివారు 2.31లక్షల మంది
- 2017 నుంచి 2022 వరకు 1.5 రెట్లు అధికం

న్యూఢిల్లీ, జూలై 7: నిత్యం దేశంలో ఎంతో మంది మహిళలు అదృశ్యమవుతున్నారు. వారిని ఎవరైనా కిడ్నాప్ చేశారా? లేక వారికి వారే వెళ్లిపోయారా? వెళ్తే ఆ తర్వాతైనా వారి ఆచూకీ ఎందుకు లభించడం లేదు? మహిళలతో పాటు పిల్లల్ని కూడా అదృశ్యం చేస్తున్నది ఎవరు? వీరినెవరైనా అక్రమ మానవ రవాణా చేస్తున్నారా? ఇవన్నీ జవాబులేని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. అదృశ్యమైన వారి గణాంకాలు కూడా ఏటికేడు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. దేశంలో ప్రతిరోజు సగటున 39 మంది మహిళలు కన్పించకుండా పోతున్నారు. వీరిలో మైనర్లు కూడా ఉన్నారు. రోజూ అదృశ్యమవుతున్న వారిలో అధికంగా ఒడిశా నుంచే 13 మంది ఉన్నట్టు అధికారిక డాటా వెల్లడిస్తున్నది. ఇలా అదృశ్యమై వారి జాడ కూడా తెలియని మహిళల సంఖ్య దేశ వ్యాప్తంగా 2017 నాటికి 1.60 లక్షలు ఉండగా, 2022 నాటికి 2.31 లక్షలకు చేరుకుంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించిన 'భారత్‌లో నేరాలు' వార్షిక నివేదికలో మైనర్లు సహా 70,649 మంది మహిళలను అదృశ్యమై కన్పించకుండా పోయిన జాబితాలో చేర్చినట్టు పేర్కొంది. 2017-2022 మధ్య ఈ డాటాను పరిశీలిస్తే అదృశ్యమైన వారిలో 67,476 మంది 18 ఏండ్ల పైబడిన వారు కాగా, 3,073 మంది మైనర్లు. 2017 చివరి నాటికి గణాంకాలు పరిశీలిస్తే 1.29 లక్షల మంది అదృశ్యమైన మహిళలు ఉండగా,

2022లో ఈ సంఖ్య 1.97 లక్షలకు పెరిగింది. అలాగే తప్పిపోయిన మైనర్ బాలికల సంఖ్య అదే కాలంలో పోలిస్తే 30,725 నుంచి 33,798కి పెరిగింది.

ఏటా పెరుగుదల నమోదు

2017 నుంచి 2022 వరకు పరిశీలిస్తే అదృశ్యమవుతున్నవారి సంఖ్యలో క్రమంగా పెరుగుదల నమోదైంది. ఈ అయిదేళ్ల కాలంలో 14.41 లక్షల మంది మహిళలు అదృశ్యం కాగా, అందులో 13.84 లక్షల మంది అచూకీని కనుగొన్నారు. ఇక ఒడిశాలో ఈ ఐదేండ్లలో 24,715 మంది మహిళలు, బాలికలు అదృశ్యమయ్యారు. వీరి సంఖ్య 2017లో 2,668 ఉండగా, అది 2022నాటికి పదిరెట్లకు పైగా పెరిగి 27,383కు చేరింది. ఈ విషయంలో మధ్యప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. అక్కడ 2017లో 25,997 మంది ఉండగా, 2022లో అది 35,759కు పెరిగింది. అయితే వాస్తవానికి 2017-22 కాలంలో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో ఉంది. ఆ సమయంలో అక్కడ 2017లో 33,083 మిస్సింగ్ కేసులు, 2022లో 38,848 కేసులు నమోదయ్యాయి. అయితే మహారాష్ట్రలో కేసుల తగ్గుదల కన్పించింది. ఇక్కడ 2017లో 27,949 ఉండగా, 2022లో 23,342కి తగ్గింది. అలాగే తెలంగాణలో సైతం 2022 నాటికి 3,051 నుంచి 1,653కు తగ్గుదల నమోదైంది. ఈ విషయంలో ఒడిశా అతిపెద్ద మూడో రాష్ట్రంగా నిలిచింది.

పురుషులు సైతం..

దేశంలో కన్పించకుండా పోతున్న వారిలో పురుషులు సైతం ఉన్నారు. ఎన్‌సీఆర్‌బీ 2023 డిసెంబర్‌లో ప్రచురించిన డాటా ప్రకారం 2022 నాటికి దేశంలోని వివిధ రాష్ట్రాలు, యూటీల్లో మొత్తం 3.83 లక్షల మంది అదృశ్యమయ్యారు. వీరిలో 1.52 లక్షల మంది పురుషులు, 21 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అదే సమయంలో 2017 నాటికి దేశంలో 2.97 లక్షల మంది అదృశ్యం కాగా, అందులో పురుషులు 1.37 లక్షల మంది, ట్రాన్స్‌జెండర్లు 163 మంది ఉన్నారు.



ఆదివారం పూరీ జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న అశేష జనవాహిని

జగన్నాథుడికి జన నీరాజనం

శోభాయమానంగా సాగిన పూరీ రథయాత్ర
రథాన్ని లాగి ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము
వేలాదిగా వచ్చిన భక్తులు..
తొక్కిసలాటలో ఒకరి మృతి

పూరీ: వేలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఒడిశాలోని పూరీలో జగన్నాథ రథ యాత్ర ఆదివారం శోభాయమానంగా సాగింది. భక్తులు 'జై జగన్నాథ్', 'హరిబోల్' నినాదాలతో మూడు రథాలను 2.5 కిలోమీటర్ల దూరంలోని గుండిచ దేవాలయం వైపు లాగుతూ తీసుకెళ్లారు. ఈ ఏడాది రథయాత్ర రెండు రోజులపాటు జరుగుతున్నది. 53 ఏళ్ల క్రితం 1971లో రెండు రోజులపాటు రథ యాత్ర జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లాంఛనంగా శ్రీ జగన్నాథుని రథాన్ని లాగి రథయాత్రను ప్రారంభించారు. జగన్నాథుడి రథయాత్రకు భారత రాష్ట్రపతి హాజరు కావడం ఇదే తొలిసారి.

భక్తుడి మృతి.. 300 మందికి గాయాలు

రథయాత్రలో అపశ్రుతి చోటచేసుకుంది. రథం లాగుతుండగా భక్తుల మధ్య జరిగిన స్వల్ప తోపులాటలో ఒకరు మరణించగా.. 300 మంది స్వల్పంగా గాయపడ్డారు. వారిని వెంటనే దవాఖానలకు తరలించారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు బంగారు చీపురుతో రథాల ముందు ఊడ్చే చెరాపహరా కార్యక్రమాన్ని నిర్వహించారు. తర్వాత బలభద్రుని తాళ ధ్వజ రథాన్ని ముందుకు నడిపిస్తుండగా జరిగిన తోపులాటలో ఒక భక్తుడు మరణించాడు.

చార్‌ధామ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

డెహ్రాడూన్, జూలై 7: ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. గర్వాల్ రీజియన్‌లో ఆది, సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ముందు జాగ్రత్త చర్యగా ఆదివారం యాత్రను ఆపేశారు. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్టు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. చార్‌ధామ్ యాత్రలో పాల్గొనే యాత్రికులు ఆదివారం ఎక్కడికక్కడే నిలిచిపోవాలని కోరామన్నారు. వాతావరణ శాఖ నుంచి తదుపరి సూచనలు వచ్చే వరకు యాత్రను కొనసాగించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, భారీ వర్షాలు ఉత్తరాఖండ్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. పలు చోట్ల రహదారులపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విష్ణుప్రయాగ్ వద్ద అలకనంద నది ప్రమాదస్థాయికి దగ్గరగా ప్రవహిస్తున్నది.

సరిహద్దుల్లో చైనా బంకర్లు

- **ఆయుధాలు, ఇంధన నిల్వ కోసం నిర్మాణాలు**
- **'బ్లాక్‌స్కై' తాజా శాటిలైట్ చిత్రాల్లో వెల్లడి**

న్యూఢిల్లీ: సరిహద్దుల్లో చైనా దుందుడుకు చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా తూర్పు లడఖ్‌లోని పాంగాంగ్ సరస్సు చుట్టుపక్కల ప్రాంతాల్లో చాలా కాలంగా తవ్వకాలు చేస్తున్నట్టు తాజాగా విడుదలైన శాటిలైట్ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. చైనా సైన్యం అక్కడ ఆయుధాలు, ఇంధనాన్ని నిల్వ చేసుకొనేందుకు అండర్ గ్రౌండ్ బంకర్లు, సాయుధ వాహనాలకు రక్షణ కల్పించేలా పార్కింగ్ నిర్మాణాలు చేస్తున్నట్టు అమెరికాకు చెందిన బ్లాక్‌స్కై సంస్థ శాటిలైట్ చిత్రాల్లో వెల్లడైంది. ఈ ఏడాది మే 30న తీసిన ఈ ఫోటోల ప్రకారం.. ఒక పెద్ద అండర్ గ్రౌండ్ బంకర్‌లోకి వాలుతో కూడిన ఎనిమిది ప్రవేశ మార్గాలు కనిపించాయి. అదేవిధంగా దానికి సమీపంలో ఐదు ప్రవేశాలతో కూడిన మరో చిన్న బంకర్ కూడా ఉన్నది. ఈ తవ్వకాలన్నీ చైనా సైన్యం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్‌ఏ) స్థావరమైన సిర్జాప్ బేస్ వద్ద జరుగుతున్నాయి. కాగా, చైనా ఈ ఆర్మీ బేస్‌ను భారత్ తన భూభాగంగా చెబుతున్న ఏరియాలో నిర్మించింది. ఈ ప్రాంతం సరిహద్దు వాస్తవధీన రేఖ(ఎల్‌ఏసీ)కి కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తాజా శాటిలైట్ చిత్రాలపై భారత సైన్యం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

ముడా స్కామ్ పత్రాల్ని విమానంలో తరలించారు!

కర్ణాటక కాంగ్రెస్ సర్కారుపై కుమారస్వామి ఆరోపణ

బెంగళూరు, జూలై 7: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) పరిధిలో జరిగిన భూ కుంభకోణానికి సంబంధించిన పత్రాలను కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక విమానంలో 'సురక్షిత ప్రాంతానికి' తరలించిందని కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. ఆర్కావతి లేఔట్ స్కామ్‌ను మరుగు పరిచినట్టుగా..కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కామ్‌ను మూయించలేదని ఆయన అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం వివాదంలో ఉన్న సంబంధిత భూమిని సీఎం సిద్దరామయ్య 2013 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన అఫిడవిట్‌లో ఎందుకు చూపలేదని ప్రశ్నించారు. '2005-06 మధ్యనే అంతా జరిగిందని సిద్దరామయ్య చెబుతున్నారు. అలాంటప్పుడు ఆ భూమిని 2013 ఎన్నికల అఫిడవిట్‌లో ఎందుకు చూపలేదు? స్కామ్ జరుగకుంటే, దర్యాప్తును సీఎం ఎందుకు అడగడం లేదు?' అని కుమారస్వామి ప్రశ్నించారు. ముడా నుంచి ఎలాంటి పత్రాలు తరలించారు, వాటిని ఎక్కడ ఉంచారో చెప్పాలని రాష్ట్ర మంత్రి బైరతి సురేశను డిమాండ్ చేశారు.

పోషక వివరాలు పెద్దగా ముద్రించాల్సిందే!

ప్యాకేజీ ఫుడ్‌పై ఎఫ్‌ఎస్ఎస్ఏఐ నిర్ణయం

న్యూఢిల్లీ,జూలై 7: ప్రతి వినియోగదారుడు నాణ్యమైన ప్యాకేజీ ఆహారం గురించి తెలుసుకునే విధంగా భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్యాకేజ్ ఫుడ్‌కు సంబంధించిన పోషక విలువలను తప్పనిసరిగా ప్రదర్శించే నిబంధన అమలు ప్రతిపాదనను అంగీకరించింది. దీని ప్రకారం ప్రతి ప్యాకెట్‌పై అందులోని ఆహారం తయారీలో వాడిన మొత్తం చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు శాతం తదితర వివరాలను పెద్ద సైజు అక్షరాలతో వినియోగదారునికి కన్పించేలా ముద్రించాలి. ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అధికారిక ఇన్‌స్టా హ్యాండిల్‌లో వెల్లడించింది. ఈ నిర్ణయం ప్రజారోగ్య భద్రతకు ఎంతో మేలు చేస్తుందని పలువురు ఇన్‌స్టాలో వ్యాఖ్యానించారు.

ఎలక్టోరల్ బాండ్ల నిధులు జప్తు చేయండి

సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ, జూలై 7: ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు అందుకున్న నిధులను జప్తు చేయాలని కోరుతూ ఖేమ్ సింగ్ భాటి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని రాజ్యాంగవిరుద్ధంగా పేర్కొంటూ ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, బాండ్ల జారీని వెంటనే నిలిపివేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)ను ఆదేశించిందని, ఇప్పటివరకు రాజకీయ పార్టీలు అందుకున్న నిధులను జప్తు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు.. వివిధ కార్పొరేట్ సంస్థలకు లబ్ధి కలిగించి, అందుకు ప్రతిఫలంగా ఈ నిధులను అందుకున్నాయని ఆయన ఆరోపించారు. సంస్థలకు అందిన అక్రమ ప్రయోజనాలపై రిటైర్డ్ జడ్జీతో కమిటీ వేసి విచారణ జరిపించాలని కోరారు.

ఆర్మీ ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

ఉగ్ర ఘటనల వెనుక రెసిస్టెన్స్ ఫ్రంట్!

శ్రీనగర్, జూలై 7: జమ్ము కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా బలగాలు నిర్వహించిన రెండు ఎన్‌కౌంటర్లలో మృతి చెందిన ముష్కరుల సంఖ్య ఆరుకు చేరింది. సుదీర్ఘంగా సాగిన ఆపరేషన్‌లలో ఆరుగురు ఉగ్రవాదులు మరణించినట్టు జమ్ము కశ్మీర్ డీజీపీ ఆర్ఆర్ స్వయిన్ తెలిపారు. మడెర్గాంలో ఇద్దరు, చిన్నిగాంలో నలుగురు ఉగ్రవాదుల మృతదేహాలను ఆదివారం గుర్తించినట్టు అధికారులు తెలిపారు. కాగా, రాజౌరి జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్‌లో జమ్ము కశ్మీర్‌లో ఇటీవల పెరిగిన ఉగ్రవాద కార్యకలాపాల వెనుక లష్కరే తోయిబాకు చెందిన రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉన్నట్టు భద్రతా దళాలు భావిస్తున్నాయి.

కోల్‌కతా సీపీ, డీసీపీపై క్రమశిక్షణ చర్యలు!

రాజ్‌భవన్‌పై దుష్ప్రచారమే కారణం!

కోల్‌కతా, జూలై 7: రాజ్‌భవన్‌పై దుష్ప్రచారం చేస్తూ అపకీర్తి తెస్తున్నారనే ఆరోపణలతో కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్, సెంట్రల్ జోన్ డీసీపీ ఇందిరా ముఖర్జీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. 'ప్రభుత్వ అధికార పదవికి తగని విధంగా పని చేస్తున్నారు' అని వారిపై జూన్‌లో గవర్నర్ సీవీ ఆనంద బోస్ హోంశాఖకు ఒక నివేదిక సమర్పించారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన హింస బాధితులు తనను కలిసేందుకు అనుమతి ఇచ్చినా ఈ ఇద్దరు ఐపీఎస్ అధికారులు మాత్రం వారిని అడ్డుకుంటున్నారని గవర్నర్ ఈ నివేదికలో పేర్కొన్నారు. ఓ రాజ్‌భవన్ ఉద్యోగినితో కలిసి తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని సైతం ఆరోపించారు. ఈ నేపథ్యంలో చర్యలకు కేంద్ర హోంశాఖ సిద్ధమైంది.

మరో నేత కొడుకు మత్తుకు మహిళ బలి!

శివసేన నాయకుడి కారు ఢీ కొనడంతో దుర్మరణం

సాక్ష్యాల చెరిపివేతకు యత్నించి పరారైన నిందితుడు

నిందితుడు మిహిర్ షా.. అతని కారు

ముంబై, జూలై 7: పుణెలో మైనర్ బాలుడు తాగిన మైకంలో పోర్ష్చే కారు నడిపి ఇద్దరు యువ ఐటీ ఇంజినీర్లను పొట్టనబెట్టుకున్న ఘటన మరువక ముందే అలాంటిదే మరోటి మహారాష్ట్రలో చోటు చేసుకుంది. పూటుగా మద్యం సేవించిన పాల్ఘడ్ జిల్లాకు చెందిన శివసేన(ఏక్‌నాథ్ షిండే వర్గం) నేత రాజేష్ షా కుమారుడు మిహిర్ షా (24) మత్తులో కారు నడుపుతూ వర్లీ ప్రాంతంలో స్కూటర్‌పై వెళ్తున్న దంపతులను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో మహిళ మృతి చెందగా, ఆమె భర్త గాయపడ్డాడు. మత్స్యకార వృత్తి చేసుకునే ప్రదీప్, అతని భార్య కావేరి నఖ్వా (45) ఆదివారం తెల్లవారుజామున అనిబిసెంట్ రోడ్‌లో వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద సమయంలో మిహిర్ షా పక్కన అతని డ్రైవర్ కూడా ఉన్నాడు. ప్రమాదం జరిగిన తర్వాత వారు అక్కడి నుంచి పరారయ్యారు. కారుపై ఉన్న పార్టీ స్టిక్కర్ చించివేసి, నెంబర్ ప్లేట్ తొలగించి ఆధారాలు చెరిపివేయడానికి ప్రయత్నించారు. అయితే కారు రాజేష్ షా పేరుతో ఉండటంతో పోలీసులు సాయంత్రం అతడిని అరెస్ట్ చేశారు. అలాగే డ్రైవర్‌ను కూడా అరెస్ట్ చేశారు. కాగా, మిహిర్ షా శనివారం రాత్రి తన మిత్రులతో కలిసి జుహూలోని వాయిస్ గ్లోబల్ తపస్ బార్‌లో మద్యం సేవించినట్టు వెల్లడైంది.

చట్టం అందరికీ సమానమే: సీఎం షిండే

శివసేన నేత కుమారుడైనంత మాత్రాన నిందితుడికి ప్రత్యేక మినహాయింపులేవీ ఉండవని, నేరం చేస్తే చట్టప్రకారం అతడు శిక్షార్హుడేనని మహారాష్ట్ర సీఎం షిండే స్పష్టం చేశారు.

'రీ నీట్'పై నేడు సుప్రీంకోర్టులో విచారణ

న్యూఢిల్లీ, జూలై 7: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఈ అంశానికి సంబంధించి దాఖలైన మొత్తం 38 పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఒకేసారి విచారించనుంది. నీట్ విద్యార్థులందరికీ మళ్లీ పరీక్ష నిర్వహించాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు కీలకంగా మారనుంది. మళ్లీ పరీక్ష నిర్వహించడం వల్ల నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని జాతీయ పరీక్ష సంస్థ(ఎన్టీఏ), కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంకు తెలియజేశాయి.

సత్సంగ్‌లో విష వాయువు వదిలారు

భోలే బాబా ప్రజాదరణ ఓర్వలేక కుట్ర చేశారు

తొక్కిసలాటపై ఆయన న్యాయవాది ఆరోపణలు

న్యూఢిల్లీ, జూలై 7: హాథ్రస్ తొక్కిసలాట ఘటనపై భోలే బాబా తరపు న్యాయవాది ఏపీ సింగ్ కొత్త విషయాన్ని తెరపైకి తెచ్చారు. సత్సంగ్‌లో కొందరు క్యాన్లలో విష వాయువు తెచ్చి వదిలారని ఆరోపించారు. భోలే బాబాకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కొందరు ఈ కుట్ర చేశారని పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సత్సంగ్‌కు హాజరైన జనం మధ్యలో 15-16 మంది క్యాన్లలో తెచ్చిన విష పదార్థాన్ని వదిలారని తన వద్దకు వచ్చిన ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్టు తెలిపారు. తాను మృతుల పోస్ట్‌మార్టం రిపోర్టులను కూడా చూశానని.. వారు గాయాలతో కాకుండా ఊపిరి అందకపోవడం వల్ల మరణించినట్టు వాటిలో ఉందని చెప్పారు. ఈ కుట్ర చేసిన వారు పారిపోయేందుకు వీలుగా వాహనాలను కూడా అప్పటికే సిద్ధం చేసి ఉంచారని, ఇందుకు సంబంధించి తమ వద్ద ఉన్న సాక్షాన్ని అందిస్తామని తెలిపారు. ఈ విషయాలను చెప్పిన ప్రత్యక్ష సాక్షులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, తొక్కిసలాట ఘటనపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విధించిన జ్యుడీషియల్ కమిషన్ విచారణ వేగవంతం చేసింది. శనివారం ఘటనాస్థలి వద్దకు వెళ్లి స్థానికులను, ప్రత్యక్ష సాక్షులను కమిషన్ సభ్యులు విచారించారు. ఈ ఘటనపై అవసరమైతే భోలే బాబాను సైతం విచారిస్తామని సభ్యులు తెలిపారు.

ఆలస్యంగా నిద్రిస్తే మానసిక సమస్యలు

న్యూఢిల్లీ: రాత్రి ఒంటి గంట వరకు మేలుకుని, తెల్లారి ఆలస్యంగా నిద్ర నుంచి లేవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. వీరు ఈ అధ్యయనంలో భాగంగా బ్రిటన్‌లోని 73,000 మంది వయోజనులను పరిశీలించారు. త్వరగా నిద్ర నుంచి మేలుకోవడం, ఆలస్యంగా నిద్రకు ఉపక్రమించడం, నిద్రపోయే సమయం వంటి వాటిని విశ్లేషించారు. నిద్రపోయే వేళలు, మానసిక ఆరోగ్యం, ప్రవర్తనలో నిలకడ లేకపోవడం వంటి వాటికి పరస్పర సంబంధం ఉందని వెల్లడైంది. రాత్రి ఒంటి గంట తర్వాత నిద్రకు ఉపక్రమించి, తెల్లవారిన తర్వాత ఆలస్యంగా నిద్ర నుంచి లేచి, రాత్రి వేళల్లో చురుగ్గా ఉండేవారి మానసిక ఆరోగ్యం కన్నా రాత్రి త్వరగా నిద్రకు ఉపక్రమించి, తెల్లవారిన తర్వాత త్వరగా నిద్ర నుంచి మేలుకుని, పగటి సమయంలో చురుగ్గా ఉండేవారి మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్టు తెలిసింది. రాత్రి ఒంటి గంట తర్వాత నిద్రకు ఉపక్రమించే వారు నిర్ణయాలు తీసుకోవడంలో, భావోద్వేగాలను నియంత్రించుకోవడంలో సమస్యలను ఎదుర్కొంటారని వెల్లడైంది. ఈ పరిస్థితికి ఇతర మానసిక సమస్యలైన ఒత్తిడి, ఆందోళన వంటివాటితో కూడా సంబంధం ఉంటుంది. ఇటువంటి అనారోగ్య పరిస్థితుల నుంచి బయటపడాలంటే, నిద్రకు ఉపక్రమించే సమయంలో మార్పులు చేసుకోవాలని పరిశోధకులు సూచించారు. వారి సూచనల ప్రకారం మొదటి వారంలో 15 నిమిషాల ముందు నిద్రకు ఉపక్రమించాలి. ఇదే విధంగా క్రమంగా త్వరగా నిద్రపోయేలా అలవాటు చేసుకోవాలి.

హెచ్‌ఐవీకి ఇంజెక్షన్ వచ్చేసింది!

కేప్‌టౌన్ : హెచ్ఐవీ ఇన్ఫెక్షన్ నుంచి కాపాడే సూది మందు పరీక్షలు విజయవంతమయ్యాయి. దక్షిణాఫ్రికా, ఉగాండాలలో నిర్వహించిన విస్తృత స్థాయి క్లినికల్ ట్రయల్స్ సత్ఫలితాలిచ్చాయి. లెనకపవిర్ ఇంజెక్షన్‌ను ఆరు నెలలకు ఒకసారి చొప్పున సంవత్సరానికి రెండుసార్లు ఇవ్వడం వల్ల యువతులను హెచ్ఐవీ నుంచి కాపాడవచ్చునని స్పష్టమైంది. రోజువారీ మాత్రల రూపంలో రెండు ఇతర ఔషధాల కన్నా లెనకపవిర్ ఇంజెక్షన్ మెరుగైనదా? కాదా? అనే అంశాన్ని ఈ పరీక్షల్లో విశ్లేషించారు. ఈ మూడు ఔషధాలు ప్రీ-ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ (పీఆర్ఈపీ) డ్రగ్స్ అని పరిశోధకులు తెలిపారు. 2,134 మంది యువతులు లెనకపవిర్ ఇంజెక్షన్‌ను తీసుకోగా, వీరిలో ఎవరికీ హెచ్ఐవీ సోకలేదు. నూటికి నూరు శాతం సత్ఫలితాలు వచ్చాయి. ట్రువడ (ఎఫ్/టీడీఎఫ్) ఔషధాన్ని 1,068 మంది యువతులు తీసుకోగా, వీరిలో 16 మందికి హెచ్ఐవీ వైరస్ సోకింది. ఈ ఇంజెక్షన్‌ను అందరికీ అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నట్టు గిలీడ్ సైన్సెస్ ఓ ప్రకటనలో తెలిపింది.

రూ.2500తో వందలాది మందికి టోకరా

- **నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు**
- **బీమా పాలసీలంటూ మోసం**

న్యూఢిల్లీ, జూలై 7: కేవలం రూ.2500 ఖర్చు చేసి ఫేక్ సిమ్ కార్డులు, 10 వేల మంది ఫోన్ డాటాను సంపాదించిన ఓ ముఠా, పెద్ద ఎత్తున ఆర్థిక మోసాలకు తెర లేపింది. ఏకంగా ఓ 'నకిలీ కాల్ సెంటర్'నే ఆ ముఠా ఏర్పాటు చేసుకోగలిగింది. తమ దగ్గరున్న మొబైల్ ఫోన్ డాటా ఆధారంగా, నిత్యం అనేక మందికి ఫోన్లు చేస్తూ..రుణాలు ఇప్పిస్తామని, భారీగా రాబడిని ఇచ్చే బీమా పాలసీలు ఉన్నాయని అమాయక పౌరులకు ఆశలు కల్పించింది. నోయిడా కేంద్రంగా ఫేక్ కాల్ సెంటర్ నడుపుతున్న ముఠా ఆగడాలను ఎట్టకేలకు అక్కడి పోలీసులు అడ్డుకట్ట వేశారు. నోయిడా సెక్టార్-51లో ముఠాకు సంబంధించి కీలక వ్యక్తులతో సహా మొత్తం 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

ప్రజాదరణ కోసం పాకులాడొద్దు

నేతలకు పోప్ ఫ్రాన్సిస్ సూచన

ట్రైస్టే (ఇటలీ): ప్రస్తుతం ప్రజాస్వామ్యం మంచి స్థితిలో లేదని పోప్ ఫ్రాన్సిస్ అన్నారు. నేతలు ప్రజాదరణ కోసం పాకులాడటాన్ని మానుకోవాలని, పటిష్టమైన సమాజాల నిర్మాణానికి, ఓటర్ల ఉదాసీనతను పరిష్కరించడానికి వారు కృషి చేయాలని ఆయన కోరారు. 87 ఏండ్ల పోప్ కేవలం రెండు నెలల్లోనే నాలుగోసారి ఇటలీని సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైస్టేలో సామాజిక వ్యవహారాలపై ఆదివారం జరిగిన సమావేశంలో ప్రసంగించారు. చాలా మంది ప్రజలు ప్రజాస్వామ్యం నుంచి తమను మినహాయించినట్టు భావిస్తుంటారని.. అలాగే సమాజంలో పేదలు, బలహీనులు తమను తాము రక్షించుకోవడానికి మిగిలిపోయారని.. వీటిని బట్టి నేటి ప్రపంచంలో ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా లేదనేది స్పష్టమవుతున్నదని అన్నారు. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం సిద్ధాంతాల లోపాలను నివారించాలని పోప్ రాజకీయ నాయకులకు సూచించారు.

అమెరికాలో కాల్పులు.. ఇద్దరు మృతి

డెట్రాయిట్: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. డెట్రాయిట్‌లోని రెనో స్ట్రీట్, రోస్సిని డ్రైవ్ ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున 22 ఏండ్ల ఓ ఆగంతకుడు కాల్పులకు తెగబడ్డాడు. స్థానికంగా ఒక వేడుక జరుగుతుండగా హాజరైన వారిని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, మరో 19 మంది గాయపడ్డారు.

ఏఐతో ప్రేమలో పడొద్దు!

న్యూఢిల్లీ: నేటి ఆధునిక కాలంలో ఇంటర్నెట్‌ను కొందరు సద్వినియోగం చేసుకుంటూ ఉంటే.... కొంత మంది దాని వినియోగాన్ని ఒక వ్యసనంగా చేసుకొన్నారు. ఆన్‌లైన్‌లోనే చాటింగ్ లేదా వీడియోలు, రీల్స్ స్క్రోలింగ్‌లతో రోజంతా గడిపేవారు కూడా ఉన్నారంటే ఎలాంటి అతిశయోక్తి లేదు. దీని వల్ల జరిగే అనర్థాలు అనేకం. ప్రస్తుత కృత్రిమ మేధ(ఏఐ) యుగంలో అయితే మానవులు ఏఐ చాట్‌బాట్‌లతో కూడా స్నేహం చేయడం, ప్రేమ పెంచుకోవడం వంటి సందర్భాలూ ఉంటున్నాయి. అయితే ఏఐతో ప్రేమలో పడొద్దని, అది కేవలం నటిస్తుందని, మీ గురించి ఎంత మాత్రం పట్టించుకోదని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. ఈ విధమైన సంబంధం మొదట్లో ఒత్తిళ్ల నుంచి ఉపశమనం కలిగించొచ్చని, హానికరం కాదని అనిపించొచ్చని, అయితే ప్రజల భావోద్వేగ ఆరోగ్యాన్ని ఏఐ ప్రమాదంలో పడేసే ముప్పు ఉన్నదని ఎంఐటీ సైకాలజిస్టు షెర్రీ తుర్కే తన నివేదికలో హెచ్చరించారు. ఏఐ చాట్‌బాట్‌లకు నిజమైన సానుభూతి, అనుబంధాలు ఉండవని, మానవ భావోద్వేగాలను ప్రతిబింబించలేవని స్పష్టం చేశారు.

13 అసెంబ్లీ స్థానాలకు 10న ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ: పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 10న ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు 13న వెలువడతాయి. వివిధ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు కొంతమంది రాజీనామా చేయటం, మరి కొంతమంది మరణించటంతో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి.

పీఎం జన ఆరోగ్య యోజన కవరేజీ రెట్టింపు!

కేంద్రం యోచన

న్యూఢిల్లీ: ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) లబ్ధిదారులను మూడేళ్లలో రెట్టింపు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వయసు 70 ఏళ్ల పైబడినవారందరినీ దీని పరిధిలోకి తేవాలనుకుంటున్నది. అదేమ విధంగా బీమా కవరేజిని సంవత్సరానికి ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచాలని కేంద్రం యోచిస్తున్నది. నేషనల్ హెల్త్ అథారిటీ దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఇది అమల్లోకి వస్తే దేశంలోని మూడింట రెండొంతుల మంది ఈ బీమాకు అర్హులవుతారు.